# నందో రాజా భవిష్యతి

నిజానికి కామేశంగారి జీవితంలో ఏమీ వడిదుడుకులు లేవు. నిదానస్తుడు. ఇంటికి నిండుగా పిల్లలున్నారు. ఇంపీరియల్ బ్యాంకులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. పిత్రార్జితం నాలుగెకరాల మాగాణీ కూడా వుంది. ఇరుగుపొరుగుల్లో మంచివాడనే పేరు సంపాదించుకున్నాడు.

అయితే అతని కొక తమ్ముడున్నాడు. తల్లితండ్రులు అతనిని పెంచి పెద్దచేసే బాధ్యతను కామేశంగారిమీద పెట్టి వెళ్ళిపోయేరు. కామేశంగారా బాధ్యతను సక్రమంగా నిర్వహించడానికి శాయశక్తులా ప్రయత్నించేడు. కాని లాభం లేకపోయింది.

కామేశంగారెంత నెమ్మదస్తుడో తమ్ముడు చలం అంత పోకిరీగా తయారయ్యేడు. తనలాగే చలాన్ని చదివిద్దామనుకున్నాడు. కాని చదువంటే అతనికి పడలేదు. స్కూలుకి వెళ్ళింది లగాయతు తోటి పిల్లవాళ్లను కొట్టటం, గోడలనిండా మేష్టర్ల మారుపేర్లు వ్రాయటం, వెనక బెంచీలలో కూర్చుని కాళ్ళతో శబ్దంచేయటం వగైరా పనులు నేర్చుకున్నాడే కాని అక్షరం ముక్కలు మాత్రం నేర్చుకోలేదు. అతని ప్రవర్తన విషయమై కామేశంగారివద్దకు ఫిర్యాదులు వస్తూవుండేవి. కోపం వచ్చి తమ్ముణ్ణి కొడుతూ వుండేవాడు. కాని వెంటనే జాలిపడి డబ్బిచ్చి వూరడించేవాడు. కొన్నాళ్లకు చలాన్ని ఆ హైస్కూలు భరించలేకపోయింది. ఆ స్కూల్లోంచి అతనికి ఉద్వాసన చెప్పేరు. కామేశంగారు వెంటనే హెడ్‌మాష్టరుదగ్గరకు వెళ్ళి బ్రతిమాలేరు. చలంయొక్క ప్రవర్తనకు తాను పూచీ వహించగలనన్నాడు. ఏమి చెప్పినా హెడ్‌మాష్టరు మాత్రం వినిపించుకోలేదు. చలానికి ఆ స్కూల్లో తిరిగి ప్రవేశమిస్తే ఉపాధ్యాయులందరూ మూకుమ్మడిగా రాజీనామా లిచ్చే ప్రమాదముందన్నాడు. కామేశంగారిక మాట్లాడలేకపోయేరు. చలంమట్టుకు 'ఒకవేళ హెడ్‌మాష్టరు దయదల్చి స్కూల్లోకి ప్రవేశమిచ్చినప్పటికీ, తానుమాత్రం జేరేదిలేదని ఖచ్చితంగా చెప్పేడు.

తర్వాత కామేశంగారు చలానికి పెళ్ళి ప్రయత్నాలుకూడా చేసేరు. పెళ్ళి చేస్తే

## జె. పరబ్రహ్మం

అతని ప్రవర్తన కొంత కుదుట పడవచ్చునను కున్నాడు. తర్వాత చలంచేత ఒక చిన్న షాపు పెట్టిస్తే అతనిపొట్ట అతను పోషించుకోగలడు.

చలం తనకు పెళ్ళి అక్కర్లేదన్నాడు.

"కారణం?"

"అది నా స్వంతవిషయం" అన్నాడు చలం.

చలాన్ని అదుపులో వుంచుకునే శక్తి తనకిక లేదని తెలుసుకున్నారు కామేశంగారు.

చదువు లేకపోయినా, చలం వేషానికి మట్టుకు తక్కువ వేసేవాడు కాదు. సిల్కు లాల్చీ, సిల్కు పంచి, కళ్ళకి చలవద్దాలు కాళ్ళకి కాబూలీజోళ్ళు మొదలైనవాటితో నిండుగా తయారయ్యేవాడు. స్వతహా అతను అందమైనవాడు. అతనిలో ఇంకొక సద్గుణం చిరునవ్వు. ఎటువంటి పరిస్థితులలో కూడా చిరునవ్వు అతని పెదవులమీద మెదులుతూ వుంటుంది. ఆ చిరునవ్వు అతని మొహానికొకవిధమైన ఆకర్షణను తెచ్చి పెట్టింది. మొత్తంమీద అతనెప్పుడూ సంతృప్తికరంగా కనపడతాడు.

అంతకంతకూ చలం ప్రవర్తన దుర్భరమైపోయింది. ఆ వూళ్ళోవున్న రౌడీలందరూ అతని ప్రాణస్నేహితులయ్యేరు. సిగరెట్లు గొలుసుకట్టుగా త్రాగటం, పేకాడటం, వీలైనన్నిసార్లు కాఫీహోటళ్ళు దర్శించటం, వచ్చిన సినిమాలన్నీ తప్పకుండా చూడటం మొదలైనవి అతని దినచర్యలో కొన్ని ముఖ్యమైన విషయాలు. ఇంతకంటె దురలవాట్లు వుండివుండవచ్చును. వాటిని కామేశంగారు తెలుసుకోదల్చుకోలేదు.

ఈ ఖర్చులన్నిటికీ డబ్బు యెక్కడినుంచి తెస్తున్నాడు అన్నదే ఒక సమస్య. అతని స్నేహితులిస్తూవుండవచ్చును అయితే యెంతకాలం యిస్తారు? కామేశంగారికి అర్థం కాలేదు.

ఒక రోజు సాయంకాలం కామేశంగారు బ్యాంకు పని పూర్తిచేసుకుని ఇంటి ముందున్న వరండాలో పడకకుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఇంతలోకే ఒక ఆసామి వచ్చి "అయ్యా, డబ్బిప్పిస్తారా?" అన్నాడు.

"ఏం డబ్బోయి!"

"తమకు తెలియదా బాబూ, చలంగారు మీ పేర కాతా రాయించి రెండునెల్లనుంచి సిగరెట్లు పట్టికెడుతున్నారు."

"నాకు సిగరెట్లుతాగే అలవాటు లేదే?"

"ఏమో బాబూ, కావలిస్తే మీ తమ్ముడుగార్ని అడగండి. తమ పేరు చెప్పబట్టి యిచ్చేం. లేకపోతే కాని అరువిద్దుమా?" అన్నాడు.

కామేశంగారు యేమీ అనలేక రెండు పదులు తీసి వాడి మొహాన్ని పారేసేరు. ఇంతలోకే కాఫీహోటలువాడు, వాడి వెనకాల ఫాన్సీషాప్‌వాడు ఈవిధంగా వచ్చి యెవరికి రావలసింది వారు పట్టుకుపోయేరు.

నిజానికి తమ్ముడు చేసిన అప్పులకు తను బాధ్యుడు కాడు. ఈవిధంగా తీర్చటం మొదలుపెడితే చలం యెన్ని అప్పులైనా సులభంగా చేయగలడు. అయితే, ఇకముందు అప్పియ్యవద్దని, ఒకవేళ యిస్తే దానికి తానెంతమాత్రం బాధ్యత వహించనని ఖండించి చెప్పేరు.

ఇంతకూ కామేశంగారు గౌరవంగా బ్రతకదల్చుకున్నారు. అందుచేత కష్టమో, నిష్ఠురమో తమ్ముడు చేసిన చేబదుళ్లన్నీ తీర్చేసేరు.

కామేశంగారు తమ్ముడి రాకకోసం ఆ రోజున కనిపెట్టుకుని కూర్చున్నారు.


అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు. అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ. కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. రు. 1/-

ఇండియన్ మెడికల్ హౌస్

లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ-2.)

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, పవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము;

సంప్రదించు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము."

గోపాలపురం. తూర్పుగోదావరి.

ఆ రాత్రివేళ చలం యింటికి చేరేడు. తమ్ముణ్ణి చూడగానే ఆయన కోపం కొంత తగ్గిపోయింది. కారణం చలం పెదవులమీద వుండే చిరునవ్వు. ఎప్పుడూ కులాసాగా కనపడతాడు. కామేశంగారికంటె కొన్ని రెట్లు సుఖంగా వుంటాడు.

"ఏం, ఇంత ఆలస్యంగా వచ్చేవు?" అన్నారు కామేశంగారు.

"ఆలస్య మేముందీ? ఇది మామూలు వేళే!" అన్నాడు చలం నవ్వుతూ.

"ఆలాగా! రోజూ ఇంతవరకూ యేమి చేస్తూ వుంటావ్?"

"సినిమాలు, తప్పితే క్లబ్బు"

"వీటికి డబ్బెక్కడిది?"

"ఇంతవరకూ నాకా సమస్య రాలేదు. అడిగినవాళ్లు కాదనకుండా యిస్తున్నారు" అని చిరునవ్వు నవ్వేడు చలం.

"నీ కిచ్చినవాళ్లు నా దగ్గర వసూలు చేస్తున్నారు. తెలుసా?" అన్నారు కామేశంగారు కొంచెం కోపంగా.

"తెలుసు. ఆ యేర్పాటు నేనే చేసేను."

"గొప్పపని చేసేవు. ఇకముందు నే నెవరికీ దమ్మిడీ యివ్వనని చెప్పేను."

"ఆస్తిలో నావాటా పంచియిచ్చేవరకూ ఆ విధంగా చెప్పే అధికారం నీకు లేదనుకుంటాను" అన్నాడు గట్టిగా నవ్వుతూ.

నిర్ఘాంతపోయేరు కామేశంగారు. "ఇవి తమ్ముడు మాట్లాడిన మాటలేనా?" అనుకున్నాడు. కామేశంగారు వట్టి ఆదర్శవాది. లేకపోతే స్పష్టంగా వినపడిన మాటల్ని సందేహించవలసిన పనిలేదు. వారిరువురకు నాలైకరాల మాగాణి అప్పులతో సహా సంక్రమించింది. కామేశంగారు పొదుపుగా సంసారాన్ని గడిపి అప్పులన్నీ తీర్చేడు. పిత్రార్జితాన్ని నిలిపి వంశగౌరవాన్ని నిలబెట్టేడు. తమ్ముడికి రెండెకరాలు యివ్వటానికి ఆయన కేమాత్రం అభ్యంతరంలేదు. కాని ఇచ్చిన ఉత్తర క్షణంలో ఆ రెండెకరాలు మాయంచేస్తాడు. అది తన కుటుంబానికి అప్రతిష్ఠ. "చలానికి యెవరో దుర్మార్గులు ఈ సలహా చెప్పివుంటారు" అనుకున్నాడు. కాని చలానికి యిటువంటి తెలివితేటలకు లోటులేదు. ఇటువంటి సలహాలు తనే ఇతరుల కివ్వగలడు.

మొత్తంమీద ఆస్తి పంపకమైపోయింది. ఆ సమయంలో కామేశంగారి కళ్లు కొంచెం చెమ్మగిల్లేయి. ఆస్తి పంచుకున్నప్పటికీ తమ్ముణ్ణి తన యింట్లోనే వుండమన్నాడు.

"ససేమిరా" అన్నాడు చలం.

తన వాటాకు వచ్చిన రెండెకరాలను చలం ఐదువేలరూపాయలుగా మార్చేడు. ఐదువేలు ఐసుముక్కలాగ కరిగించటం మొదలుపెట్టేడు. సినిమాలు, కాఫీ హోటళ్ళతో పాటు జూదము, వేశ్యాగృహాలుకూడా అలవాటయ్యాయి. చూసేవారికి చలమంతవిలాస పురుషుడు ఇంకొకడుండగలడా, అనిపించేడు. కామేశంగారుమాత్రం తమ్ముడి ప్రవర్తనకు చాలా విచారించేరు. "డబ్బైపోయిన తర్వాత వాడిగతేమిటి?" అనుకున్నారు.

ఒకరోజుసాయంత్రం చలం యింటికొచ్చేడు. మనిషిమట్టుకు చాల సంతృప్తిగా కనపడ్డాడు. వులెన్‌సూట్, సిల్కునెక్టయి వేసుకున్నాడు.

"నీ ప్రవర్తన యేమీ బాగా లేదు" అన్నారు కామేశంగారు.

"యెవరికి?"

"చూసేవారికి"

"ఎవరికో బాగాలేకపోతే నాకేం? నాకు బాగానేవుంది."

"ఇప్పుడు బాగానేవుంటుంది. ఐదువేలూ పూర్తైనతర్వాతతర్వాత యేం, చేస్తావు?"

"పూర్తికానియ్యి. తర్వాతమాట తర్వాత ఆలోచించుకోవచ్చును." అన్నాడు.

చలంమాత్రం అన్నగారిపిల్లలకు మిఠాయి వుండలు, బిస్కట్లు, ఏవో కొన్ని సిల్కుగుడ్డలు కొనియిచ్చేడు. మళ్ళీరోజు ఉదయమే వెళ్లిపోయేడు.

తర్వాత చలం ఆ వూళ్ళో యెవరికీ కనపడలేదు. ఒకసంవత్సరంవరకూ చలం జాడ కామేశంగారికి తెలియలేదు. ఆయన తమ్ముణ్ణిగురించి యెంతో విచారించేడు. "పాపం, ఐదువేలు ఆఖరైఉంటుంది. ఏమి తిప్పలు పడుతున్నాడో" అనుకున్నారు.

ఒకరోజు ఉదయం హఠాత్తుగా చలం దిగేడు. మనిషి యేమాత్రం డబ్బుకి యిబ్బంది పడినవాడిలాగ కనపడలేదు. ట్వీడ్‌సూట్, హేట్, నోట్లో సిగరెట్, చేతిలో లెదర్ కేస్‌తో ప్రత్యక్షమయ్యేడు. బండివాడు వెనకనుంచి, ఒక క్రొత్త హోలాల్ ఫ్లాస్కు తెచ్చి లోపలపెట్టేడు. కామేశంగారు ఆశ్చర్యపోయేరు. "ఎక్కడినుంచి? ఏమిటి విశేషం?"అని మాత్రం అనగలిగేరు.

"కలకత్తానుంచి. అంతా మామూలే." అని టూకీగా సమాధానం చెప్పి లోపలికి వెళ్లిపోయేడు. కామేశంగారు మాత్రం తమ్ముడేదో పెద్ద వుద్యోగం చేస్తున్నాడు కాబోలు అనుకున్నారు. అంతే కాని అక్షరజ్ఞానం లేనివాడికి ఉద్యోగ మెవరిస్తారని ఆయనకు తట్టలేదు.

ఆరోజు ఆదివారం. కామేశంగారు భోజనంచేసి వాలుకుర్చీలో నడుం వాల్చేరు. చలం నీలిరంగు పైజమా, నీలిరంగు బుష్‌షర్టు తొడుక్కొని ఒక మంచంమీద ప్రశాంతంగా కూర్చుని పేకతో పేషెన్సు ఆడుకుంటున్నాడు.

ఇంతలోకే ఒక ఆంగ్లో ఇండియన్ వనిత రేచుక్కలాగ విసురుగా తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించింది. ఆమె సగము దొరసాని అయినప్పటికీ శరీరపు రంగు దేశవాళీ ఛాయకంటె తక్కువగా వుంది. బుగ్గలు దించుకొనిపోయి వున్నాయి. రింగులు తిరి


జీవితమును

మలబద్ధకము

భారముగా చేయనీయకండి




బ్రూక్‌లాక్స్

మిమ్ము రాత్రికి రాత్రి

సరిదిద్దును

99 A, అర్మీనియన్ వీధి.
మద్రాసు.

DMA.19

గిన గిరజాల క్రాఫు, తలపైన ఒక లేడీ హేట్, కాళ్లకు యెత్తైన మడమలుగల జోళ్లు ధరించింది. ఆమె కళ్లు కోపంతో అతి క్రూరంగా వున్నాయి. వయసు సుమారు ముప్ఫైఅయిదు సంవత్సరా లుండవచ్చును. ఆమె రాకతో కామేశంగారు అదిరిపడి లేచేరు. ఆమె సంస్కృతి యెటువంటిదో కాని వచ్చినది లగాయతు "యూ డాంకీ, యూ నిగ్గర్," అనే పదజాలం ఆమె నోటి వెంట అతి ధారాళంగా వస్తోంది. చలం మాత్రం ఆమె రాకను గుర్తించినట్టు కూడా కనిపించలేదు. తదేకదృష్టితో తన ఆట నడుపుకుపోతున్నాడు. కాసేపటికి అసలు విషయమేమిటో కామేశంగారికి అర్థమైంది.

చలం కలకత్తాజేరి కొన్నినెలలు అతి జల్సాగా తిరిగేడు. తర్వాత ఈ ఆంగ్లో ఇండియన్ స్త్రీ అతని జీవితానికి తటస్థపడింది. ఆమె విదేశవ్యాపారం చేసే ఒక కంపెనీలో స్టెనోగ్రాఫర్ గా పనిచేస్తోంది. కొన్నిరోజులవరకూ తన డబ్బుతోటే ఆమెను సినిమాలకు నాట్యశాలలకు తదితర వినోదస్థలాలకు టాక్సీలలో త్రిప్పేడు. ఆమె దృష్టికి అతనొక లక్షాధికారిలాగ కనపడ్డాడు. ఆవిధంగా చలం చెప్పేడుకూడా. అతని మాటలునమ్మి అతనిని ప్రేమించింది; లేదా ఆ విధంగా నటించింది. కొంతకాలానికి చలందగ్గిర డబ్బైపోయింది. తాత్కాలికంగా ఆమె పెట్టుబడిపెట్టి సంసారాన్ని నడిపింది. ఆమెదగ్గర డబ్బుకూడా అయిపోయింది. ఆమె జీతంతోటే మరికొంత కాలం గడిపేరు. ఎప్పటికప్పుడు చలం యింటివద్దనుండి డబ్బుతెప్పిస్తానని వాగ్దానాలు చేస్తూవుండేవాడు.

మరికొన్నిరోజులకు చలంయొక్క స్థితిగతులనుగురించి ఆమెకు అనుమానం కలిగింది. చలం డబ్బుతెస్తేనేకాని ఇక సంసారం గడవటం కష్టమనిచెప్పింది. ఈ విధమైన జీవితం యేమంత గౌరవప్రదమైనది కాదని రిజిష్టర్డు పెళ్ళిచేసుకుంటే నయమని ఆమె సలహాయిచ్చింది. చలానికి లక్షలకొలదీ రూపాయలఆస్తివుందని ఆమెకింకాఆశవుంది. చలం యెటువంటి పెళ్ళికైనా సిద్ధమే కాని డబ్బుతీసుకొని రావటానికిమాత్రం సిద్ధంగా లేడు. "ఇదిగో, అదిగో" అంటూ ఇంకా కొన్నిరోజులు గడిపేడు. క్రమేపీ ఆమె ఒత్తిడి యెక్కువైంది. అంతకంతకు చలం ఆమెకు భారమైనాడుకూడా. చివరకో రోజున డబ్బుతెస్తేనేకాని ఇంట్లో అడుగు పెట్టవద్దనిచెప్పింది.

సమయస్ఫూర్తిగల చలం వెంటనే "మా వూరువెళ్లి డబ్బుతెస్తా" నన్నాడు. కాని అతని కుయుక్తి ఆమెనుందర పనిచేయలేదు. వాడు యింటికివెళ్లి డబ్బుతీసుకురాడు. పైగా ఆమె డబ్బుకూడా చాలా వరకు తినేసేడు.


"నువ్వు యింటికి వెళ్లి డబ్బుతెస్తావని నమ్మకమేమిటి?" అంది.

"నా యెడ్రెస్సు నీ కిచ్చేనుకద! ఇంక భయమెందుకు?" అన్నాడు.

"నువ్విచ్చిన యెడ్రెస్సు సరియైనదని నమ్మ ననుకుంటున్నావా?" అంది.

"అయితే యేంచేయమంటావ్?"

"పద. మీ వూరు నేనుకూడా వస్తాను,



ప్రభుత్వ అతిథిభవనం (విజయవాడ)

ఫొటో: ఉప్పలూరి వెంకటశ్రీనివాసరావు.

డబ్బు తెచ్చుకుని తిరిగివద్దాం”

చలం సందిగ్ధంలో పడింది. అయితే అతినాటకంగా పైకి తేలే మనిషి కాడు.

“ఒక్కటే అబ్బాయి. కాని ప్రయాణానికి ఖర్చులవుతాయి.”

“దానికేం మనం విలాసాలకు పెట్టే ఖర్చులో ఇది ఒక్కవంతు?” అంది. టిక్కెట్ల ఖర్చు కూడా ఆమే భరించవలసి వచ్చింది. చలం తను మొదట చెప్పిన వూరికి కాక ఇంకొక వూరికి టిక్కెట్లు తీసుకున్నాడు. దాంతో ఆమెకు చలం చెప్పేవి అన్నీ అబద్ధాలే అని తెలిసిపోయింది. “అతనికొరకే తను పెట్టిన ఖర్చు లేనా కనీసం రాబట్టుకుంటే చాలు” అనుకుంది.

రైలు దిగగానే చలం ఒక హోటల్లో ఆమెకు బస యేర్పాటుచేసి తను యింటికి వెళ్ళి డబ్బు తెస్తానన్నాడు. ఇంటికి ఆమె కూడా వస్తే బాగుండదన్నాడు. ఆమె “సరే” అంది. చలం మెల్లగా యింటికి జారుకున్నాడు.

చలం వెళ్ళగానే ఆమెకు అనుమానం కలిగింది - తను యింటికి వెళ్ళి డబ్బు తెస్తాడా. లేకపోతే ఇంకో రైలు యెక్కి వుడాయిస్తాడా? అని — తిరిగి కలకత్తా జేరుకునేందుకు డబ్బులు కూడా ఆమెదగ్గర లేవు. అక్కడ వున్న వాళ్ళందరనూ వాకబు చేసి కామేశంగారింటికి చేరింది.

ఆమె వాలకం చూడగానే కామేశంగారికి గుండె ఆగిపోయినంతపనైంది. ఆమెను బిగ్గరగా మాట్లాడవద్దని బ్రతిమాలుకున్నాడు. ఆమె అరుపులు విని ఇరుగు పొరుగువారందరూ అక్కడకు చేరతారని ఆయన భయం. “ఫలాని కామేశంగారి తమ్ముడేం చేసేడో తెలుసా?” అని అందరూ చెప్పుకుంటారు. ఇక తను తలెత్తుకుని తిరగటం యెల్లాగ?

అయినా “ఫలాని చలం” అనక “కామేశంగారి తమ్ముడు” అని చెప్పుకుంటారు. కారణ మేమంటే ఎవరేమనుకున్నా చలానికి లక్ష్యం లేదు. కామేశంగారు మాత్రం తన పరువు పోయినట్లు బాధపడతారు. పరువుకోసం ప్రాకులాడేవాళ్ళే పట్టుకుని బాధించటమే సంఘంయొక్క ఉద్దేశ్యం కావచ్చును.

ఆంగ్లో హైందవి మాత్రం రెచ్చిపోతోంది. తన డబ్బు చలం వినియోగించుకున్నాడని, పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేసి తన జీవితాన్ని పాడుచేసేడని, అయినప్పటికీ తనదగ్గరనుంచి తీసుకొని వాడు కున్న పైకమిస్తే తప్పకుండా వెళ్ళిపోగలనని, [illegible] మోసగించి తన మానం పోగొట్టినందుకు పరిహారాన్ని ఉదారంగా వసూలుకోగలనని చెప్పింది. కనీసం ఒక వెయ్యిరూపాయలు యిస్తే తను వెళ్ళిపోగలనని చివరి బేరంగా అంది.

కామేశంగారు ఆమెను యెంత త్వరగా వదుల్చుకుంటే అంత మంచిదనుకున్నారు. ఈ విషయం అందరకూ తెలిసేలోగా ఆమెను పంపించివేయాలి! తన కష్టార్జితంలో నుంచి వెయ్యిరూపాయలు తీసి ఆమెకిచ్చేరు.

ఆంగ్లో హైందవి ఆ పైకం అందుకుని, చలం వైపు తిరిగి [illegible] తన మొదటి భర్త తాలూకు [illegible] వస్తువులు వాపసు చేయమని ఆజ్ఞాపించింది. చలం తన హోటలు యావత్తు ఆమెకు [illegible] చేసేడు. అదికూడా పుచ్చుకొని ఆమె [illegible] వెళ్ళిపోయింది. కామేశంగారి కొక పెద్ద



లంగరు

ఫొటో: వేముల ఆచార్య—విజయవాడ.

# ★ సంపోరాజా భవిష్యతి ★

గాలివాన వచ్చి వెలిసినట్టైంది. కిటికీగుండా ఆమె వెళ్ళిపోయినవైపు చూసేరు. ఆంగ్లో హైందవి వెంట ఒక పెద్ద గుంపొకటి వస్తోంది. ఆమె అతి వుద్రేకంతో చేతులు త్రిప్పుకుంటూ యేవో చెబుతూ చకచకా నడిచిపోతోంది. ఆ దృశ్యాన్ని భరించలేక కామేశంగారు కిటికీ తలుపులు మూసేశారు.

చలం మట్టుకు ఈ విషయాలేవీ తనకు సంబంధించినవి కానట్టు తదేక దృష్టితో పేకాడుతూ కూర్చున్నాడు. అతనికి చీమ కుట్టినట్టుకూడా లేదు. అతనొక కార్యశూరుడు. చేతికందిన సుఖాలన్నీ అనుభవించటమే తప్ప దానివల్ల కలిగే ఫలితాలకు అతనెంతమాత్రం బాధ్యత వహించదల్చుకోలేదు.

తర్వాత కామేశంగారు చలాన్ని కేకలు వేసేరు. చలం అవికూడా తనను కానట్టు విని వూరుకున్నాడు. తమ్ముని మీద అభిమానముంది కాని ఈ విధంగా యెంత డబ్బు తెచ్చిపోయగలడు! తనకు పెళ్ళి చేయటానికి కుమార్తెలు చదువులు చెప్పించటానికి కుమారులు వున్నారు. ఈ విధంగా డబ్బు తగలేస్తే పిల్లల బాధ్యత ఉపేక్షించినట్టవుతుంది.

చలం ఇక ముందెప్పుడూ తన నిమిత్తమై ఒక్క రూపాయికూడా ఖర్చుచేయవలసిన అవసరం రాదన్నాడు. వీలైన వెంటనే తన నిమిత్తమై ఆంగ్లో ఇండియన్ వనితకు ఇచ్చిన వెయ్యి రూపాయలు తిరిగి యిచ్చివేయగలనన్నాడు.

కళ్లు మూసుకుని బాధతో నవ్వేరు కామేశంగారు. చలం దృష్టి తన వేలుకున్న ఉంగరంవైపు పోయింది. అది మంచి రోజులలో ఆంగ్లో హైందవి యిచ్చిన బహుమానం. ఉద్రేకంలో, వెళ్ళిపోయేటప్పుడు అది తిరిగి పుచ్చుకోవటం మర్చిపోయింది. ఆ వుంగరం అమ్మితే కొంత డబ్బు వస్తుంది. ఆ డబ్బు పూర్తిఅయ్యేవరకు చలం నిశ్చింతగా వుండవచ్చును.

మర్నాడు చలం తన సూటుకేసుతో సహా యెక్కడికో వెళ్ళిపోయేడు.

చలం వెళ్లటం కామేశంగారికి యేమీ సుఖంగా లేదు. వెళ్లినవాడు తిన్నగా వుండక మళ్ళీ యే అవాంతరాలు తెస్తాడో అని ఆయన భయం. కాని తమ్ముడు ఇటువంటి ప్రమాదాలేమీ తీసుకునిరానన్నాడు. అయితే అతని మాటకు విలువేముంది?

మళ్ళీ తమ్ముడంటే కొంత జాలివేసింది. వెళ్ళేటప్పుడు జేబులో ఒక్క రూపాయికూడా లేదు. తెలియనిచోటకు పోయి యేమి అవస్థలు పడుతూవుంటాడో అనుకున్నాడు. కామేశంగారు తన తమ్ముడి దుస్థితిని తన ఆప్తమిత్రుడైన పార్థసారథితో చెప్పుకున్నాడు.

పార్థసారథి నాలుగు చీవాట్లు వేసేడు. "నువ్వెక్కడో వెఱ్ఱివాడివిలాగ వున్నావు. నీ తమ్ముడెంత సుఖంగా వున్నాడో నీకేమి తెలుసు? నిన్న నాకు స్టేషనులో కనపడ్డాడు. మద్రాసు వెడుతున్నాడట. తనంత సుఖజీవి ఈ ప్రపంచంలో యెవరూ వుండరన్నాడు. అతనికే చీకూ చింతా లేదు. కలకత్తాలో వుండగా అతననుభవించని సుఖమంటూ లేదట. ప్రతి నిముషం భోగాలకే వినియోగించేడట." అన్నాడు.

ఈ మాటలకు కామేశంగారు విస్తుపోయేరు. "వట్టివెధవ కాకపోతే, పాడుపనులు చేయటమే కాకుండా గర్వంగా చెప్పుకుంటున్నాడు కూడాను." అనుకున్నారు.

పార్థసారథి అక్కడితో వదలిపెట్టలేదు. "నీ తమ్ముడెప్పుడూ సిల్కుసూట్లలో నేకనిపిస్తూవుంటాడు. నువ్వు ఆఫీసుకికూడా చిరిగిపోయిన ముతకకోటు వేసుకొనివస్తావు. నువ్వు ప్రాణంపోయినాసరె అని మూడవ క్లాస్ ఫుట్‌బోర్డుమీద నిలబడే ప్రయాణం చేస్తావు. నీ తమ్ముడు నిన్న హాయిగా సెకండ్ క్లాసుబర్తు రిజర్వు చేయించుకుని వెళ్ళేడు. నువ్వు చస్తే కాఫీ హోటల్లో అడుగుపెట్టవు. మీవాడు నిన్న స్పెన్సర్‌లో చేరి తిన్నంతతిని త్రాగినంత త్రాగేడు. నీ పిల్లలకు యెప్పుడూ జబ్బులేఅంటావు. పిల్లలను చంకనేసుకుని అసుపత్రిచుట్టూ తిరుగుతూవుంటావు. నువ్వెప్పుడో ముందు సుఖపడదామని డబ్బు జాగ్రత్తపెడుతున్నావు. తెలియని భవిష్యత్తుకోసం ప్రాకులాడక ఈరోజు సుఖాలు చేతికిచిక్కినంతవరకు ధైర్యంగా వినియోగపర్చుకుంటున్నాడు నీ తమ్ముడు."అని ఒక ఉపన్యాసందంచివదలిపెట్టేడు పార్థసారథి.

"వీణ్ణి యెవడడిగేడు ఈ సలహాలన్నీ!" అనుకున్నాడు కామేశంగారు.

"ఈరోజుమాటసరే. రేపటివిషయం ఆలోచించక్కర్లేదా?" అన్నాడు కామేశం.

"కళ్ళతో ప్రత్యక్షంగా చూస్తున్నది ఈరోజు. రేపు మనం చూడగలమో లేదో!" అన్నాడు పార్థసారథి.

"ఈ వేదాంతం యెప్పుడు నేర్చుకున్నావు?"

"నిన్న మీ తమ్ముడిదగ్గర."

"అయితే వాడిపద్ధతులు నువ్వు ఆచరణలో పెట్టుకోవేమీ?"

"ఒరే! బ్రదర్ ఆ విషయాలు తెలిసినా లాభంలేదురా. కొందరు జీవితంలో భారం మోయటానికి, మరికొందరనుభవించటానికీ పుడతారనుకుంటాను." అన్నాడు పార్థసారథి.

ఆనాటి రాత్రి కామేశంగారి ఆలోచనలన్నీ చలాన్ని గురించే. "వట్టి అమాయకుడు. ముందుసంగతి ఆలోచించుకోడు. పాపం వంటరివాడు. పెళ్లాంపిల్లలూ లేరు. పెళ్లియే యోగ్యతకూడా కనపడ్డంలేదు. ఏ జబ్బుచేసినా అతన్ని చూసేవారెవరు? జేబులో రూపాయి వుంటే అది ఖర్చయ్యేవరకూ నిద్రపోడు. ఇక ముందెల్లాగ నడుస్తుంది? అతని భవిష్యత్తు అంతా అంధకారమే. ముసలితనం వస్తే ముష్టెత్తుకోవటం తప్ప గత్యంతరం లేదు. వాడివంశం వాడితో ఆఖరవ్వలసిందే!...తనకో? కొంత స్థిరత్వముంది. ఒక సంసార మేర్పడింది. ఏదో వుద్యోగం చేసుకుంటున్నాడు. పిలలు బుద్ధిగా చదువుకుంటున్నారు పెద్దవాళ్ళై వాళ్లపొట్టలు వాళ్లు పోషించుకోగలరు. తనకు ముసలితనం వచ్చినా బాధలేదు. రిటైరయినతర్వాత ప్రావిడెంట్ ఫండు పెట్టి ఒక యిల్లు కొనుక్కోవచ్చును. తన జీవితాన్ని నాలుగువేల రూపాయలకు భీమాచేస్సేడు. దాంతో రెండెకరాల పొలం కొనుక్కోవచ్చును. పింఛను డబ్బులతో పై ఖర్చులు నడతాయి. "ఇక చలం గతి అంతేకాబోలు" అని విచారపడ్డాడు.

మర్నాడు చలం దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది. క్రితం రోజున తాను వివాహం చేసుకున్నానని, వివాహం తొందరలో యేర్పాటు కావటంవల్ల అన్నగారిని వదినగారిని పిలవలేకపోయినందుకు క్షమించమని వ్రాసేడు. వీలైతే అన్నగారిని ఒక్కసారి వచ్చి చూసి వెళ్ళమని తన చిరునామా కూడా ఇచ్చేడు.

వీడికి పిల్లనిచ్చే తలమాసిన వాడెవ్వడున్నాడని కామేశంగారికి సందేహం వచ్చింది. చలానికి పొట్టకోస్తే అక్షరం ముక్కలేదు. నడతా మంచిదికాదు. ఆస్తియేమున్నా వుందా అంటే అంతకంటే లేదు. తన పొట్ట పోషించుకోలేడు. ఇక పెళ్లాన్ని యెల్లాగ భరించగలడు? ఉత్తరంలో సంగతి నమ్మవెళ్లటమూ, మానటమా? మళ్లీ యేదో అవాంతరం నెత్తిమీదకు తెచ్చిపెట్టుకుని వుంటాడు; అనుకున్నారు.

ప్రసిద్ధమైన నంజనగూడు పండ్లసాది వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ కస్తూరి మాత్రలు...రూ॥ 0-6-0
కర్జక్ గోరోజన మాత్రలు... 0-6-0
బాలక్స్ విరేచనమగుటకు మాత్రలు... 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1, విజయవాడ.

సంగతేమిటో తెలుసుకుందామని కామేశంగారు మద్రాసు చేరి చలం యిచ్చిన చిరునామా వెతుక్కుంటూ వెళ్ళేరు. అదొక పెద్దమేడ. చుట్టూ పూల తోట. ఎత్తైన ప్రహరీలు. ఆ హంగామా చూడగానే తమ్ముడెవరికో టోపీ వేసేడను కున్నాడు. ధైర్యంచేసి లోపలకు వెళ్ళేడు. "ఫలాన వెంకటచలపతిరావుగారున్నారా?" అని అడిగేడు. ఒక పనివాడు "ఆ - ఉన్నారు. మీరు వారి అన్నగారా?" అని ప్రశ్నించేడు.

పనివాడు కామేశంగారిని లోపలకు తీసుకుపోయి ఒక సోఫామీద కూర్చొబెట్టేడు. కాసేపటికి చలం ప్రత్యక్షమయ్యేడు. చిరునవ్వుతో అన్నగారిని పలకరించేడు. కామేశంగారి కేమనాలో కూడా తోచలేదు. తర్వాత చలం తన పెళ్ళిసంగతి చెప్పేడు.

కలకత్తాలో వుండగానే "బాదరా బందీ లేని లక్షాధికారైన ఒక వితంతువుకు అందమైన వరుడు కావలెను" అనే ప్రకటన చూసేడు. కాబోయే భర్తకు కావలసిన యోగ్యత అందం మాత్రం. ఆ యోగ్యత అతనికి వుంది. దరఖాస్తు పంపించేడు. దాని ఫలితమే ఈ వివాహం. వధువుకు కావలసింది అందమైన వరుడు. వరునికి కావలసింది డబ్బు. వివాహమైపోయింది.

అతని భార్య పేరు లోకసుందరి (పేరుకు మాత్రమే). తండ్రి లేడు. తల్లి ముసలి. ఆమెకు మద్రాసులో మూడు నాలుగు మేడలున్నాయి. నాలుగైదు లక్షల రూపాయలు గవర్నమెంటు సెక్యూరిటీలలోను బ్యాంకు డిపాజిటలోనూ వున్నాయి. ఆ భాగ్యానికంతా ఆమే సర్వాధికారిణి.

పది నిముషాలలో లోకసుందరి కూడా వచ్చింది. ఆమెను చూడగానే కామేశంగారికి మూర్ఛ వచ్చినంతపనైంది. కళ్ళున్నవాడెవడూ ఆ విగ్రహాన్ని చూసి పెళ్ళిచేసుకోటానికి సాహసించలేడు. ఆమె సన్నగా పొడుగ్గావున్న ఒక యెముకలగూడు. నల్లటి శరీరం పాలిపోయివుంది. చప్పిడి ముక్కు. ముందుపళ్ళు నాలుగూ యెత్తుగా కోరలవలె వున్నాయి. మశూచివల్ల మొహమంతా గుంటపడిపోయివుంది. మిడిసెపకు భూతద్దాలాంటి దళసరైన కళ్ళద్దాలు పెట్టుకొంది. చలం ఆమెను కామేశంగారికి పరిచయం చేసేడు. ఆమె అప్పుడప్పుడు దగ్గుతోంది. ఆమె మొదటిభర్త క్షయ వచ్చి చచ్చిపోయాడట. ఈ వార్త తెలియగానే 'హరి, హరీ' అనుకున్నారు కామేశంగారు.

ఆమె మేడలూ తోటలూ కామేశంగారిని ఆకర్షించలేదు. "తమ్ముడికి యెంతగతిపట్టింది!" అని విచారించేరు. ఇంత వికృతమైన మనిషితో జన్మంతా కాపురంచెయ్యాలి! ఆమెకు కలిగే సంతానం యింకా యెంత వికృతంగా వుంటుందో. ఆమెకు ఆడపిల్లలు పుట్టవచ్చును. వారికి వివాహం చెయ్యటం సాధ్యమా?" ఈవిధంగా ఆలోచించేరు కామేశం. ఇంతకూ ఈమె వితంతువు! వంశం చెడింది.

ఇదొక పెళ్ళి, పవిత్రమైనది, ఈమె భార్య, జన్మంతా ఈమెతోటే కాపురం చేయాలి, వికారమైన సంతానం కలుగవచ్చును, వారికి వివాహాలు చేయగలమా? అని ఆలోచించేవాడెవడూ ఈ వివాహానికి అంగీకరించడు. అయితే చలంమట్టుకు అటువంటి వెర్రి ఆలోచనలు చేయడు. అతనికి కావలసింది డబ్బు. ఆ డబ్బుతో యే సుఖాన్నైనా కొనుక్కోగలడు. అతనికి కావలసింది అంతే!

చలం చాకచక్యంవల్ల ఆమెను పూర్తిగా వశపర్చుకున్నాడు. అతడేమిచెపితే దానికామె తక్షణం అంగీకరిస్తుంది.

కామేశంగారు భోజనంకూడా చేయకుండా వెంటనే వెళ్ళిపోయేరు. అన్నగారి అమాయకత్వానికి చలం నవ్వుకున్నాడు.

కామేశంగారు ఆఫీసుకు వెళ్ళగానే పార్థసారధి కనపడి "మీ తమ్ముడెవరో లక్షాధికారిని పెళ్ళిచేసుకున్నాడటకదూ! యోగ్గేనా అదృష్టవంతుడు."అన్నాడు.

ఒకరోజున కామేశంగారు చిరిగిపోయిన ఒక పాతగొడుగు వేసుకొని సుస్తీగావున్న పాపని చంకనపెట్టుకుని ఆసుపత్రికి వెడుతున్నారు. రాత్రంతా బ్యాంకులో క్రరెంట్ యెకౌంట్ లెడ్జరు సరిచూస్తూ గడిపేరు. అతి-చిరాకుగా నడుస్తున్నారు. ఎదురుగుండా చలం సరికొత్త ఫోర్డుకారు నడుపుకుంటూ వచ్చేడు. పెద్దదొరలాగ వున్నాడు. లోకసుందరిని మదనపల్లి శానటోరియంలో జేర్చేడట. ఆస్తికంతా తానే నిజమైన అధికారినని చెప్పేడు. అన్నగారికి వాగ్దానంచేసిన వెయ్యిరూపాయలు ఇచ్చివేసేడు. "డబ్బుకి యిబ్బంది పడకు. కావలిస్తే యింకా డబ్బిస్తాను. సుఖంగా బ్రతకటం నేర్చుకో." అని సలహా యిచ్చి వెళ్ళిపోయేడు. కామేశంగారు గుడ్లు మిటకరించి చూసేరు. "ఓయి, వెర్రికామేశమా, చేజిక్కిన సుఖాల్ని యిప్పుడు కాదని వాయిదాలు వేసుకునేవాడిగతి ఇంతే" అని అంతరాత్మ యెక్కడినుంచో సన్నగా చెప్పినట్టైంది. ★


నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిస్సత్తువ, శుక్లక్షయమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ సీసా రు. 3-4-0 పోస్టేజి 15 అ.

టి. సి. ఏ. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం"

పిరిగెపి- నెల్లూరు జిల్లా.











బ్రహస్పతి

ఉత్తర ధృవ నక్షత్ర కూటమిలో బృహస్పతి నక్షత్రము మిక్కిలి తేజస్సుగలది.

.... ఎస్ట్రెలా బ్యాటరీలు గూడా తక్కువ ధరకు, నిశ్చయముగు ప్రకాశవంతమైన కాంతికి ప్రసిద్ధి జెందినవి.

ఎస్ట్రెలా బ్యాటరీలు

ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్.